క్లుప్తంగా

న్యాయ సేవాధికార సంస్థతో న్యాయం



తెనాలిరూరల్: ఏ సమస్య తలెత్తినా మండల న్యాయ సేవాధికార సంస్థని ఆశ్రయిస్తే ఉచిత న్యాయ సహాయం అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి అన్నారు. తెనాలి సుల్తానా బాద్‌లోని జేఎంజే వధార్ హోంను శనివారం న్యాయమూర్తి సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న మహిళలకు, బాలికలకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను తనిఖీ చేశారు. వీరి వెంట న్యాయశాఖ సిబ్బంది మహబూబ్, జె.వాణి, స్వధార్ హోం ప్రతినిధి హృదయ మేరి ఉన్నారు.

ముగిసిన చిల్డ్రన్ బైబిల్ క్లినిక్



తెనాలి: తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా జరిగిన చిల్డ్రన్ బైబిల్ క్లినిక్ శనివారంతో ముగిసింది. జ్ఞానం కోసం అన్వేషణ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో పిల్లలకు కథలు, ఆటలు, కంఠత వాక్యాలు నిర్వహించారు. బైబిల్ పై జరిగిన క్లాసులో.. దేవుడు మనుషుల్ని ఎలా చేశారు, సృష్టిని ఎలా చేశారు.. మనుషులు పాపం చేస్తే దేవుడు వారిని ఎలా శిక్షిస్తాడు వంటివి కథల పూర్వకంగా చెప్పి వారిలో భక్తి విశ్వాసాన్ని, క్రమశిక్షణ పెంపుదలకు కృషిచేసినట్లు సంఘ కాపరి రెవరెండ్ వేజెండ్ల సురేష్‌బాబు తెలిపారు. పిల్లలకు బహుమతులు అందజేశారు. సంఘ కాపరి, పాస్టరమ్మ సండే స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

నూరు శాతం ఓటింగ్‌తోనే ప్రజాస్వామ్యం పరిపుష్టం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశంలో ఓటింగ్ నూరు శాతం జరిగేలా యువత, విద్యార్థులు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనాలని 'లెట్స్ ఓట్' ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కె.మాల కొండయ్య పేర్కొన్నారు. 40 రోజులుగా గుంటూరు నగరంలోని ఓటర్లలో ప్రజాస్వామ్య విలువలు, ఓటు ప్రాధాన్యం చాటుతూ చైతన్య పరుస్తున్న లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం లాడ్జి సెంటర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్న యువతీ, యువకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా లెట్స్ ఓట్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రాధాన్యం తెలియజేస్తూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్య పరిచినట్లు పేర్కొన్నారు. ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షుడు మేడూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ బలోపేతానికి విద్యార్థులు, యువకులు ముందుండి నడిపించాలని కోరారు. ప్రొఫెసర్ మద్దినేని సుధాకర్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కర్, సీతా రమేష్, సదాశివరావు పాల్గొన్నారు.

అన్నాబత్తునిదే ప్రచార ఆదిపత్యం

సార్వత్రిక ఎన్నికల ప్రచార ఘట్టం ముగిసింది. ఇక పోలింగ్‌కు కొన్ని గంటల వ్యవధి మాత్రమే ఉంది. ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో ఇప్పటి వరకు జరిగిన ప్రచార సరళిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ ముందంజలో ఉన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం వివిధ రూపాల్లో ఆయన అన్ని వర్గాలను ఆకట్టుకోగలిగారు. ఎన్నికలకు కేవలం నెలల ముందు తెనాలి వచ్చిన జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ప్రచారంలో పూర్తిగా వెనుకబడ్డారు. రోడ్ షోలు, ఆత్మీయ సమావేశాలకే పరిమితమయ్యారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సాంకేతిక లోపంతో పోటీలో లేని విషయం తెలిసిందే.

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ముందంజ
- ప్రచార సరళితో ఓటర్ల మనసు గెలుచుకున్న శివకుమార్
- అన్ని వర్గాలతో సత్సంబంధాలు, ఆత్మీయ సమావేశాలు
- నామినేషను దాఖలు రోజున రోడ్ షోతోనే సానుకూల పవనాలు
- జనసేన అభ్యర్థి నాదెండ్లకు గుక్కతిప్పుకోని ప్రచార ఎదురుదాడి



నామినేషను దాఖలు రోడ్ షోలో అన్నాబత్తుని శివకుమార్ (ఫైల్)

తెనాలి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ స్థానికంగా నివాసం ఉంటూ, ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లోనే ఉండటం కలిసొచ్చింది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గత రెండేళ్లలో వారానికి అయిదురోజుల చొప్పున షెడ్యూలు వేసుకుని నియోజకవర్గంలో ప్రతి ఇంటి తలుపు తట్టారు. ఆప్యాయంగా పలకరించి, అందించిన సంక్షేమాన్ని వివరించి, ఇతర సమస్యలుంటే తెలుసుకున్నారు. ప్రతి గడపకు వెళ్లేందుకు దాదాపు 20 నెలల సమయం తీసుకుంది. స్థానికంగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయడం సానుకూలంగా మారింది.

ఎన్నికల షెడ్యూల్‌కు ముందే శివకుమార్ ప్రచారాన్ని ఆరంభించారు. ఆయన సతీమణి అన్నాబత్తుని పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఒక బృందంగా పట్టణంలో ఇంటింటి ప్రచారం చేశారు. పెద్ద కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ రూరల్ మండలంలో, చిన్నకుమారుడు అన్నాబత్తుని అఖిల గణేష్ కొల్లిపర మండలంలో స్థానిక నేతలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే శివకుమార్ ప్రతి రోజూ పార్టీ నేతలు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఉదయం పట్టణంలోని వార్డులకు, సాయంత్రం గ్రామాల్లోని వారితో సమావేశమై ఎన్నికల ప్రచార వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నామినేషను రోజున జరిగిన రోడ్ షో నభూతో నభవిష్యతి అన్నట్టుగా సాగటంతోనే సానుకూల పవనాలు వీచాయి.

ఆ తర్వాత కుల సంఘాల ఆత్మీయ సమావేశాలు, రోడ్ షోలతో ప్రచారాన్ని ఉధృతం చేశారు. వివిధ సామాజిక వర్గాలతో సమావేశమై, నియోజకవర్గంలో తను చేసిన సామాజిక న్యాయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వం తరపున అందించిన సంక్షేమ సాయాన్ని వివరించారు. మొత్తం మీద నియోజకవర్గంలో రూ.1800 కోట్ల సంక్షేమాన్ని, 27 వేల మందికి ఇళ్ల స్థలాలను ఇచ్చినట్లు వివరిస్తూ వచ్చారు. నిత్యం అందుబాటులో ఉండి.. అయిదేళ్లలో 6,245 కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు గుర్తుచేశారు. కరోనా లాక్‌డౌన్‌లో ఇతర పార్టీల నేతలు హైదరాబాద్, గుంటూరు నగరాలకే పరిమితమైతే, తాను ఒక్కడిగా చేసిన సేవలను ప్రస్తావిస్తూ అందరి మన్ననలు పొందారు.

వెనుకబడిన నాదెండ్ల..

తెనాలిలో మార్పు తీసుకొస్తానని చెబుతున్న కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ రోడ్ షోలు, కొన్ని ఆత్మీయ సమావేశాలకే పరిమితమయ్యారు. ఆయన హయాంలో చేపట్టిన అభివృద్ధి పథకాల్లోని డొల్లతనాన్ని అధికార పార్టీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ వివరిస్తూ ఎదురుదాడి చేశారు. మనోహర్ తెనాలికి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. నాలుగు లేన్ల రహదారి ఆగిపోవటానికి మనోహర్‌కు, సంబంధిత కాంట్రాక్టరుకు ఉన్న అవినాభావ సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కూడా సభల్లో వివరించారు. తెనాలిలో సొంతిల్లు ఉన్నా గత పదేళ్లుగా ఆయన హైదరాబాద్‌లో ఉంటున్న విషయాన్ని జనానికి గుర్తుచేశారు. పైగా జనసేన నాయకులు పెట్టిన వినాయకుడి పందిళ్లకూ తాను హాజరయ్యాననీ, వారి నూతన షాపులను తానే ప్రారంభించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. పంచాయతీ రాజ్, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన జనసేన అభ్యర్థులకు తగిన ఆర్థిక సహకారం అటుంచి, మనోహర్ కనీసం ప్రచారం కూడా చేయలేదని ఎండగడుతూ వచ్చారు. ఇలా అన్ని రకాలుగా అధికార పార్టీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ప్రచారంలో ముందంజలో ఉండి గెలుపు దిశగా బాట వేసుకున్నట్లు జనంలోకి వెళ్లింది.



రోడ్‌షోకు హాజరైన జన సందోహం (ఫైల్)

నాదెండ్లను ఓడించడమే ధ్యేయం

మాదిగ మహా సేన రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్, పక్కన కలెవరపు దేవానంద్

తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను ఓడించటమే మాదిగల ధ్యేయమని మాదిగ మహా సేన రాష్ట్ర అధ్యక్షుడు కొరిటిపాటి ప్రేమ్‌కుమార్ వెల్లడించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విజయానికి తోడ్పడాలని కోరారు. రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా శనివారం తెనాలి వచ్చిన ప్రేమ్ కుమార్, స్థానిక జై భీమ్ ఫెడరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. విపక్ష కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ దళితుల పట్ల అహంకారపూరిత ధోరణితో వ్యవహరిస్తూ చిన్నచూపుతో హేయంగా మాట్లాడతారని విమర్శించారు. దీనికి తోడు మనోహర్‌కు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్టేనని స్పష్టం చేశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులను గుర్తు చేశారు. నేషనల్ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన నివేదికలో దేశ వ్యాప్తంగా బీజేపీ పాలిత అయిదు రాష్ట్రాల్లో దళితులపై దాడులు అధికంగా ఉన్నట్లు చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తే దాడులు పెరుగుతాయి మినహా తగ్గేది లేదన్నారు. బీజేపీతో పొత్తు కలిసిన పార్టీలను ఓడించటమే లక్ష్యంగా మాదిగలు కృషిచేయాలని కోరారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు విజయం చేకూర్చాలని కోరారు. వీరితో జై భీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కలెవరపు దేవానంద్, మాదిగ మహా సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుద్దేటి జోషి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు కూచిపూడి గోపి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు కొదమల వినయ్ కుమార్, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చిలకా రమేష్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి దొప్పపూడి యలమంద, బుట్టి సురేష్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీకే బ్రాహ్మణ సంఘీయుల మద్దతు



మద్దతు తెలియజేస్తున్న బ్రాహ్మణ సంఘ నేతలు

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని బ్రాహ్మణ సంఘీయులు ఆ పార్టీ విజయానికి కృషి చేయాలని రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ డైరెక్టర్ త్రిపురారి భొట్ల సత్యజ్ఞాన ప్రసూనాంబ కోరారు. స్థానిక కొత్త పేటలోని బ్రాహ్మణ పరిషత్ కార్యాలయంలో శనివారం బ్రాహ్మణ అధ్యయన కమిటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలను గరిష్టంగా అందించటమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లోనూ ప్రాధాన్యతను ఇచ్చిందని గుర్తుచేశారు. తెనాలిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌ను, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్కరాజు లక్ష్మణరావు మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు, ఎమ్మెల్యేలు కోన రఘుపతి, మల్లాది విష్ణు, జ్వాలాపురం శ్రీకాంత్, బ్రాహ్మణ అధ్యయన కమిటీ సభ్యుడు పోతావఝుల పురుషోత్తమశర్మ వంటి నేతల సూచనల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపునకు తోడ్పడాలని చెప్పారు. పురుషోత్తమ శర్మ మాట్లాడుతూ తెనాలిలో ఎమ్మెల్యే శివకుమార్ 418 మంది సంఘీయులకు ఇళ్ల స్థలాలను ఇచ్చారనీ, 318 మందికి ఈబీసీ నేస్తం ఆర్థిక సాయం చేశారని, మరో 500 మందికి అమ్మ ఒడి సాయం అందించినట్టు గుర్తుచేశారు. నామినేటెడ్ పదవుల్లో ఇచ్చిన ప్రాధాన్యతను కె.కమలేంద్రకుమార్ వివరించారు. మన్నెపల్లి ఆదిశేషగిరిరావు, ముక్కామల జయప్రద, బ్రాహ్మణ కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ ఎన్ఆర్‌కే శర్మ, త్రిపురారిభట్ల దత్తు, శివ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13 నిర్వహించనున్న పోలింగ్‌కు గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. దివ్యాంగుల కోసం ర్యాంప్‌లు కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. బీఎల్‌ఓల ద్వారా ఓటర్ల స్లిప్‌లు పంపిణీ చేయడం జరిగిందని, పోలింగ్ రోజు ఓటరు గుర్తింపు కార్డ్(ఎపిక్ కార్డ్) తీసురావాలని, ఓటర్ గుర్తింపు కార్డ్ లేకుంటే పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, వంటి 11 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి పోలింగ్ అధికారులకు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, టాయ్ లెట్స్, లైటింగ్, టెంట్‌లు, కుర్చీలు వంటి మౌలిక వసతులను సంబంధిత ప్రాంత ఏఈలు పూర్తి చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలోపు పార్టీల కార్యాలయాలు ఉండకూడదన్నారు. తూర్పులో 234 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ జరుగుతుందని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో 2,50,691 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 1,21,849, మహిళలు 1,28,808, ఇతరులు 34 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల విధుల పర్యవేక్షణ, క్షేత్ర స్థాయిలో అధికారుల నుంచి అందే ఫిర్యాదులు, సూచనల పర్యవేక్షణకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో రిపోర్టింగ్ టీం, స్పెషల్ కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ సమయంలో ఏ సమస్య ఎదురైనా పరిష్కారానికి క్విక్ రియాక్షన్ టీంని నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామన్నారు.

ఉదయం నుంచే మెటీరియల్ పంపిణీ

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు గుంటూరు తూర్పు పరిధిలో 255 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన పోలింగ్ మెటీరియల్ పంపిణీకి ఏసీ కాలేజీలో ఏర్పాట్లు పూర్తి చేశామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచే పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శనివారం ఏసీ కాలేజ్‌లో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ని పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను 22 సెక్టార్‌ల వారీగా విభజన చేసి, ప్రత్యేకంగా అధికారులను కేటాయించామన్నారు.

సమగ్ర వికాసంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపా సాగర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచీకరణ నేపథ్యంలో విద్యార్థులు సమగ్ర వికాసంతో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. శనివారం జేకేసీ కళాశాల 56వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ కృపాసాగర్ మాట్లాడుతూ మనిషి సమగ్ర వికాసానికి విద్య దోహదం చేస్తుందన్న స్ఫూహతో ఐదున్నర దశాబ్దాలకు పూర్వమే జాగర్లమూడి కుప్పుస్వామి స్ఫూర్తితో నెలకొల్పిన జేకేసీ కళాశాల ఖ్యాతి విస్తరించటం అభినందనీయమని అన్నారు. అనంతంగా విస్తరించిన విద్యా, జ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగాలని సూచించారు. ర్యాంకులు, మార్కులతో కాకుండా కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, కరెంట్ అఫైర్స్, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు శారీరక, మానసిక వికాసానికి దోహదపడే క్రీడలు, పోటీ పరీక్షలపై ఆసక్తి కనబర్చాలన్నారు. తొలుత కళాశాల మూల స్తంభాలైన జాగర్లమూడి చంద్రమౌళి, జాగర్లమూడి నరేంద్రనాథ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ కళాశాల ఆడిటోరియాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ జేకేసీ కళాశాల గత 10 ఏళ్లుగా యూజీసీ ఏ గ్రేడ్ గుర్తింపు పొందుతూ విద్యా ప్రమాణాల స్థాయిని నిలబెడుతోందని అన్నారు. కార్యక్రమంలో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంటూరి నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ పరుచూరి గోపీచంద్ పాల్గొన్నారు.

ఓటేస్తే.. ఉచితంగా కంటి పరీక్షలు

గుంటూరు మెడికల్: దేశంలో ప్రఖ్యాతిగాంచిన వాసన్ ఐ కేర్ సంస్థ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ నెల 13 ఓటేసిన తర్వాత వేలికి ఉన్న ఇంక్‌ను తమ ఐ కేర్ సెంటర్‌లో చూపిస్తే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. అంతేగాకుండా ఉచిత కంటి పరీక్షలు తర్వాత చేసే అవసరమైన సందర్భంలో చేసే చికిత్సకు, సర్జరీలకు కూడా ఆఫర్‌ను ప్రకటించింది. ఓటు వేసిన వారికి ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటుగా చికిత్సకు, సర్జరీ చేస్తే వాటిలో డిస్కౌంట్ ఆఫర్ ప్రకటించింది. చికిత్స, సర్జరీలకు విధించే చార్జీలలో పది శాతం వరకు తగ్గింపు అందిస్తామని ఆ సంస్థ తెలిపింది. ఈ ప్రత్యేక ఆఫర్‌ను ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు వినియోగించు కోవచ్చునని వెల్లడించింది. ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో మరింత చైతన్యం కలిగించేందుకు ఈ తరహా ప్రకటన చేసినట్లు వాసన్ ఐ కేర్ పేర్కొంది. గుంటూరు నగరంలో, కొత్తపేట శివాలయం ఎదురుగా ఉన్న వాసన్ ఐ కేర్ సెంటర్‌లో సంప్రదించాలని పీఆర్వో వెంకట్రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.